క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాటా 20, పచ్చిమిర్చి 45, బెండ 40, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 25, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 18, క్యారెట్ 45, చిక్కుడు 80, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొర (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 120.

ఒకరికి కరోనా పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదే విధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 14 మందికి చేసినట్లు తెలిపారు.

20 నుంచి 'డ్రాగన్ ఫ్లై కిడ్స్ ఫెస్ట్'

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో ఈ నెల 20 నుంచి డ్రాగన్ ఫ్లై థీమ్ తో ఉచిత ఎంట్రీతో కిడ్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధుల తెలిపారు. డ్రాగన్ ఫ్లై నేపథ్యంతో ఆహ్లాదకరమైన వినోద విజ్ఞాన కార్యక్రమాలు, తోలు బొమ్మలాటలు, మ్యాజిక్ షోలు, గేమ్‌లు, వర్క్‌షాప్‌లు, మీట్ అండ్ గ్రీట్ సెషన్లు , లైవ్ షోలు ఉంటాయన్నారు. వచ్చే నెల 4 వరకూ కొనసాగే ఈ ఫెస్ట్‌లో 12 ఏళ్ల లోపు చిన్నారులు పాల్గొనవచ్చన్నారు.

'భారతీయ విద్యాభవన్స్'లో నూరు శాతం ఉత్తీర్ణత



మేఘన పాఠశాల టాపర్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యాభవన్స్ పాఠశాలలో సీబీఎస్ఈ టెన్త్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి మాట్లాడుతూ.. 260 విద్యార్థులు పరీక్షలు రాయగా 260 మంది ఉత్తీర్ణలయ్యారని తెలిపారు. పాఠశాల టాపర్‌గా కె. మేఘన నిలిచిందన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.

ఎవరీ చిన్నారులు?







తప్పిపోయిన వచ్చిన చిన్నారులు

మియాపూర్: ఇంటినుంచి తప్పిపోయి రోడ్డుపై తిరుగుతున్న ఇద్దరు చిన్నారులను మియాపూర్ పోలీసులు చేరదీసి శిశుసంక్షేమ కేంద్రంలో బుధవారం చేర్పించారు. సీఐ తిరుపతి రావు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని న్యూ కాలనీ శివాలయ సమీపంలో గుర్తుతెలియని మూడున్నర, నాలుగున్నర సంవత్సరాల వయస్సు గల ఇద్దరు చిన్నారులు తిరుగుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మియాపూర్ పోలీసులు వెళ్లి చుట్టు పక్కల వారిని విచారించగా, చిన్నారులకు సంబంధించిన ఎలాంటి వివరాలు తెలియరాలేదు.చిన్నారులు తమ తల్లిదండ్రుల పేర్లుగానీ, ఎక్కడి నుంచి వచ్చారనేది గానీ చెప్పలేకపోయారు. దీంతో ఆ ఇద్దరు చిన్నారులను మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి అక్కడి నుంచి సంరక్షణ కోసం యూసుఫ్‌గూడలోని శిశు విహార్‌కు తరలించారు. చిన్నారులను ఎవరైనా గుర్తుపడితే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.

మధుమేహ వ్యాధికి సరికొత్త చికిత్స విధానం



చికిత్స విధానం సూచించే చిత్రాలు



రాయదుర్గం: మధుమేహ వ్యాధి కోసం సరికొత్త చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎస్పైర్ బయోనెస్ట్ ఇంక్యుబేటర్‌లోని స్టార్టప్ సంస్థ 'రీజెన్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఆధ్వర్యంలో ఈ సరికొత్త చికిత్స విధానాన్ని రూపొందించారు. రోగి చిన్నపేగు ద్వారా డైటరీ గ్లూకోజ్‌ను గ్రహించడాన్ని నిరోధించడం ద్వారా గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయని, తద్వారా డయాబెటీస్ నిరోధించబడుతుందని రీజెన్ ఇన్నోవేషన్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం వంగల, రీజెన్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్ సక్సేనాలు తెలిపారు. టైప్-2 వ్యాధిగ్రస్తుల్లో రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడానికి ఈ కొత్త విధానం తోడ్పడుతుందన్నారు.





మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లో రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

రోడ్డు ఆక్రమణలకు అడ్డుకట్టేది?

- రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు
- పార్కింగ్ స్థలం లేకుండానే షట్టర్ల ఏర్పాటు
- రోడ్లపైనే వినియోగదారులు వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు ఇక్కట్లు

మియాపూర్: వ్యాపార సముదాయాలకు పార్కింగ్ వసతి లేకపోవడం వాహనదారులకు సమస్యలు తెచ్చి పెడుతోంది. ట్రాఫిక్ కష్టాలతో పాటు ప్రమాదాలకు కూడా కారణమవుతోంది. పరిష్కరించాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వాహనదారులతో పాటు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాలనీలో చిన్నపాటి రోడ్లుల్లో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. వారికి పార్కింగ్ స్థలం లేకపోవడం అక్కడికి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ జామ్ వంటి సమస్యలు వస్తున్నాయి. పార్కింగ్ సదుపాయం లేకుండా షట్టర్లు వేస్తున్న వారిపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఫుట్ పాత్‌లపై వ్యాపారాలు చేయడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- మియాపూర్, చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, జేపీఎన్‌నగర్, మయూరీనగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు, మియాపూర్ బొల్లారం రోడ్డు, ఓల్డ్ మియాపూర్, మంజీరా రోడ్డు, హుడా కాలనీ, ఇక్రిశాట్ కాలనీ, పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు, జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్లలోని వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో ఆయా షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, కాలనీలో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది.
- మియాపూర్, చందానగర్‌ల్లోని ప్రధాన రోడ్లుతో పాటు కాలనీ అంతర్గత రోడ్లు ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి. దీంతో రాకపోకలకు స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. దీనిపై పలుమార్లు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.
- చందానగర్‌లోని హుడా కాలనీ, మంజీరా రోడ్డులో వాహనాల పార్కింగ్ స్థలం లేకపోవడంతో పాటు భవనంలో పార్కింగ్ కోసం వదలాల్సిన స్థలంలో షట్టర్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో వినియోగదారులు తమ వాహనాలను రోడ్డు పైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది.
- ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో, సెలవు దినాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు రద్దీగా ఉంటున్నాయి. రోడ్లపై వాహనాల పార్కింగ్ చేయడం, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి.
- చందానగర్ డివిజన్ దీప్తిశ్రీనగర్ కాలనీలో ఓ భవన యజమాని అనుమతులు లేకుండా అదనంగా రెండు అంతస్తులు నిర్మించడంతో పాటు ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలంలో మూడు షట్టర్లు ఏర్పాటు చేశాడు. దీంతో పాటు రోడ్డుపైనే మెట్లు, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను నిర్మించారు. రోడ్డుపైనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం జరగవచ్చని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ:

కోట్ల రూపాయలు వెచ్చించి పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి. ఫుట్‌పాత్ వ్యాపారుల వద్ద వివిధ వస్తువులను కొనుగోలు చేయడానికి వచ్చిన వాహనదారులు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో అంతర్గత రహదారుల్లో రాకపోకలు సాగించలేక గంటల తరబడి రోడ్లపైనే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్ పోలీసులు రోడ్లను ఆక్రమించి వ్యాపారులు చేసే వారిపైనా, పార్కింగ్ స్థలం లేకుండా షట్టర్లు ఏర్పాటు చేసే వారిపైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎంపీ అరవింద్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న రవికుమార్ యాదవ్

ఘనంగా రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



తనయుడు ఎం.రవికుమార్ యాదవ్‌తో మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్

గచ్చిబౌలి: బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎం.రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. రవికుమార్ పుట్టిన రోజు సందర్భంగా మసీద్‌బండలోని ఆయన నివాసానికి బుధవారం భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే, తన తండ్రి భిక్షపతి యాదవ్ సమక్షంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఎంపీ ధర్మపురి అరవింద్‌తో పాటు పలువురు నాయకులు రవికుమార్ జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు ఉదయం నుంచే భారీ సంఖ్యలో తరలివచ్చి రవికుమార్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. గజమాలలో అభిమానులు ఊరేగింపుగా తరలిరావడంతో మధ్యాహ్నం వరకు కోలాహలం నెలకొంది. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొబ్బా నవతా రెడ్డి, నాయకులు రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ నుంచి విజయవాడకు ఈ-గరుడ ఎలక్ట్రికల్ బస్సులు

ప్రారంభ ఆఫర్‌గా ఛార్జీపై తగ్గింపు

మియాపూర్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం కాలుష్యరహిత ఈ గరుడ ఏసీఎలక్ట్రికల్ బస్సులు ఈ నెల 16న ప్రారంభించింది. మియాపూర్ నుంచి విజయవాడకు ఈ బస్సులు తిరుగుతున్నాయి. ప్రారంభోత్సవ ఆఫర్‌గా ఈ- గరుడ ఏసీ బస్సు ఛార్జీలను నెల రోజుల పాటు తగ్గించినట్టు మియాపూర్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. మియాపూర్ నుంచి విజయవాడకు చార్జీ రూ. 830 ఉండగా.. రూ.750కి తగ్గించారు. ఎంజీబీఎస్ నుంచి విజయవాడకు రూ.780 ఉండగా.. రూ. 710కి తగ్గించినట్లు తెలిపారు. ఈ ఆఫర్ నెల రోజుల పాటు ఉంటుందన్నారు.

ఈ - గరుడ ఏసీ బస్సుల సమయం

- మియాపూర్ నుంచి ప్రతి రోజూ ఉదయం 6.25 గంటలకు, 8.25కి, 10.25కి, సాయంత్రం 6.5కి, సాయంత్రం 7.45కి, రాత్రి 9.45కి మియాపూర్ నుంచి బయలుదేరి వెళ్తాయి.
- అదే విధంగా ఎంజీబీఎస్ నుంచి ఉదయం 8.10కి, 10.10కి, 12.10కి, సాయంత్రం 7.50కి, రాత్రి 9.30కి, 11.30కి బయలుదేరుతాయి.
- తిరిగి విజయవాడ నుంచి ఉదయం 6.20 గంటలకు, 8 గంటలకు, 10 గంటలకు, సాయంత్రం 6.40కి, రాత్రి 8.40కి, రాత్రి 10.40కి బయలుదేరి వెళ్తాయన్నారు.

బీఆర్క్ తొలిబ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం (డీమ్డ్) విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ తొలి బ్యాచ్ 2018-23 విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. కిన్నెర సెమినార్ హాల్‌లో ఈ సమావేశం జరిగింది. స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ సునీల్ కుమార్ స్వాగతోపన్యాసంతో సమావేశం ప్రారంభమైంది. విభిన్న కార్యక్రమాలు, వర్క్‌షాపు ద్వారా ప్రావీణ్యం సంపాదించిన విద్యార్థులను అభినందించారు. 'ప్రయత్నించు, సేవ చేయి, వృద్ధిచెందు' అనే గీతం నినాదాన్ని ముందుకు తీసుకెళ్లి, బయటి ప్రపంచంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. సాంస్కృతి కార్యక్రమాలతో సీనియర్లకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి

పటాన్‌చెరు టౌన్: రాజకీయ నాయకులు, బిల్డర్ల చేతిలో మోసపోయిన అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ గ్రామం, ఐలాపూర్ తండా బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు అద్దెలు చెల్లించలేక అవగాహన లోపంతో ఇళ్లు కొన్నారన్నారు. అయితే ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిద్ర మత్తులో మునిగిపోయి కోర్టు ఆర్డర్ పేరిట అర్ధరాత్రి ఇళ్లు ఖాళీ చేయించడం బాధాకరమన్నారు. పేదలను మోసం చేసి స్థలాలు విక్రయించి సొమ్ము చేసుకున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఊళ్ల మధు(27) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మద్యానికి బానిసైన మధు మంగళవారం రాత్రి 9:30 గంటలకు మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతిచెందాడు. సోదరుడు భరత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

రాయదుర్గం: పాలిటెక్నికల్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిసెట్-2023 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గచ్చిబౌలి పరిసరాల్లో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, విద్యార్థులంతా నిర్ణీత సమయానికే హాజరై పరీక్ష రాశారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీ, గచ్చిబౌలి జెడ్పీహెచ్ఎస్, మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మణికొండ జెడ్పీహెచ్ఎస్, నార్సింగి జెడ్పీహెచ్ఎస్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను కోఆర్డినేటర్ షేక్ ఎక్బాల్‌హుస్సేన్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా, రాయదుర్గం జీఐఎల్‌టీ 150 మందికి 132 మంది(88శాతం). జెడ్పీహెచ్ఎస్ గచ్చిబౌలి 240కు 205 మంది(85.4శాతం), మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మందికి 219 మంది(91.25శాతం), జెడ్పీహెచ్ఎస్ మణికొండలో 240కు 206 మంది(85.83), జెడ్పీహెచ్ఎస్ నార్సింగిలో 300 మందికి 259 మంది (86.33శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని ఆయన తెలిపారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడండి



ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ పరిస్థితిపై పోలీసు అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా కొండాపూర్ రోడ్డు మూసివేతతో మూడు రోజులుగా ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సరళిని పరిశీలించారు. గచ్చిబౌలి జంక్షన్, క్యూ మార్ట్, రాడిసన్ హోటల్, ఐకియా గేట్‌నెంబర్ వన్, మైండ్ స్పేస్ జంక్షన్, సైబర్ టవర్స్‌ను పరిశీలించారు. పోలీసులు అందుబాటులో ఉండి ట్రాఫిక్ సమస్య తలెత్త కుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్, ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లీ, ఏడీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ రెడ్డి, మాదాపూర్ ఏసీపీ రఘునందన్ రావు తదిరతులు పాల్గొన్నారు.

న్యూ ఎరా హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో న్యూ ఎరా పాఠశాల ఉపాధ్యాయులు

ఆల్విన్‌కాలనీ: ఇటీవల ప్రకటించిన 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో వివేకానందనగర్ కాలనీలోని న్యూ ఎరా హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 2022-23 విద్యా సంవత్సరంలో 16 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు సంస్థ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 100 శాతం ఉత్తీర్ణతతో ముందున్నామని అన్నారు. 9 గ్రేడ్ పాయింట్లకు పైన 126 మంది విద్యార్థులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీకి ఇక తిరుగులేదు

- పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్



ఎన్టీఆర్‌నగర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: బీజేపీకి శేరిలింగంపల్లిలో ఇక తిరుగులేదని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీలో బీజేపీ గిరిజన మోర్చా రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు హన్మంతునాయక్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాదయాత్రలతో బీజేపీ మరింత బలోపేతం కావడంతో పాటు, నూతన చేరికలతో పార్టీ పటిష్ఠంగా మారిందన్నారు. బీజేపీ, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసినప్పుడే పార్టీ విజయం సాధ్యమవుతుందన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, గచ్చిబౌలి డివిజన్‌లో బీజేపీ పటిష్ఠంగా ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేస్తారన్నారు. రవికుమార్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వసంతకుమార్ యాదవ్, వరలక్ష్మి, విఠల్, శివసింగ్, తిరుపతి, కిషన్, రంగస్వామి, శ్రీరాములు, నర్సింగ్‌నాయక్, సుబ్రహ్మణ్యం, కృష్ణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేసిన శ్రీకృష్ణయూత్ సభ్యులు

శేరిలింగంపల్లి: నల్లగండ్లకు చెందిన శ్రీకృష్ణ పటేల్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. నల్లగండ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. శ్రీకృష్ణయూత్ చైర్మన్ పి. శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు, భీమని ఆదిత్య, సురేందర్, భాస్కర్, జయసాయి, లక్ష్మణ్, శివానంద్‌రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలకు రక్తపోటు మూలం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



బొటానికల్ గార్డెన్‌లో ఆటోమెటిక్ బీపీ చెకప్ మిషన్‌పై బీపీ పరీక్షించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ఆధునిక జీవన శైలి వల్ల రక్తపోటుకు గురయ్యే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని, అదే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో హోలిస్టిక్ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ బీపీ చెకప్ మిషన్‌ను అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిత్యం వ్యాయామం, యోగా చేయడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటంతోపాటు జీవన శైలిలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటికప్పుడు బీపీ పరీక్ష చేయించుకుంటే సరైన వైద్యం చేయించుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ కార్డియాలజిస్ట్ దయాసాగర్, హోలిస్టిక్ హాస్పిటల్ చైర్మన్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ప్రతి 8 మందిలో ఒకరికి రక్తపోటు

మాదాపూర్: భారత్‌లో అకాల మరణాలకు ప్రధాన కారణాల్లో హైబీపీ ఒకటని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం వరల్డ్ హైపర్‌టెన్షన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఉచిత ఆరోగ్య పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ, మెడికవర్ హాస్పిటల్స్‌లో ఈనెల 31వ తేదీ వరకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎత్తు, బరువు, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో, కార్డియాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్ కన్సల్టేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత దేశంలో ప్రతి 8 మందిలో ఒకరికి రక్తపోటు ఉన్నట్లు అధికార లెక్కల ప్రకారం తెలుస్తోందన్నారు. ఈ సమస్య వచ్చిస్తే తీవ్రమైన గుండెజబ్బులు, కిడ్నీ సమస్యలు, మెదడు సంబంధిత రక్తనాళాలలో ఇబ్బందులు వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. 30,40 సంవత్సరాల వయస్సులో చాలా మంది గుండెపోటుకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో షీటీం సీఐ సునీత , సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ కృష్ణప్రసాద్, మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ మాతప్రసాద్, మార్కెటింగ్ హెడ్ ఎంకే గంగాధర్‌ప్రసాద్ పాల్గొన్నారు.



మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత ఆరోగ్య పరీక్షల పోస్టర్‌ను విడుదల చేసిన పోలీస్ సిబ్బంది తదితరులు